విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

అంగన్వాడీల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, మున్సిపల్ కార్మికుల మరియు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి లింగం ఫిలిప్ డిమాండ్ చేశారు. శుక్రవారం మచిలీపట్నం బస్టాండ్ సెంటర్ నుండి అఖిలపక్ష నాయకులతో కలిసి ర్యాలీగా కృష్ణాజిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50% పెన్షన్ ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వర్కర్, హెల్పర్, మినీ వర్కర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచి వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాలు ఉద్యోగలను రెగ్యులర్ చేయాలని, అందరికీ హెచ్ఆర్‌పి డిఏ అమలుచేసి వేతనాలు పెంచాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానంగా రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేయాలని, మున్సిపల్ ఆప్ కాస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఇంజనీరింగ్ ఉద్యోగులకు హెల్త్ ఎలవెన్సులు చెల్లించాలని, డ్రైవర్లకు వేతనం రూ.18,500 చేయాలని, పంచాయతీల ద్వారా మున్సిపాలిటీలో విలీనమైన కార్మికులకు మున్సిపల్ కార్మికుల వేతనాలు, హెల్త్ అలవెన్స్ అందించాలని డిమాండ్ చేశారు.

జనవరి 1న పింఛన్ల పంపిణీ లేనట్లే..!

విశాలాంధ్ర-కూచిపూడి : నూతన సంవత్సర కానుకగా పెంచిన పింఛన్లు 1వ తేదీ నుంచి గ్రామాలలో పంపిణీ జరిగే అవకాశాలు లేవు. ప్రతినెల 1వ తేదీన పంపిణీ చేసే వలంటీర్లు 2023 సంవత్సరంలోని డిసెంబర్ నెల నుంచి పెంచిన పింఛను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేయించడానికి షెడ్యూల్ కేటాయించారు. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు ఆయా మండల పరిషత్ కార్యాలయాలకు శుక్రవారం వచ్చాయి. దీని ప్రకారం పామర్రు నియోజకవర్గంలోని పామర్రు మండలంలో 2వ తేదీన, తోట్లవల్లూరు మండలంలో 3వ తేదీన, మొవ్వ మండలం, పమిడిముక్కల మండలంలలో 4వ తేదీన, పెదపారుపూడి మండలంలో 5వ తేదీన ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆయా స్థానిక గ్రామ, మండల, జిల్లా పరిషత్ ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీలు ప్రారంభించనున్నారు. జిల్లాలోని అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం, పెనమలూరు, గన్నవరం గుడివాడ. నియోజకవర్గాలలో కూడా 25 మండలాల్లో జనవరి 2 నుంచి 5వ తేదీ లోపుగా ఆయా ఎమ్మెల్యేల పర్యవేక్షణలో పింఛన్లు పంపిణీకు శ్రీకారం చుట్టనున్నారు.

మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం వినియోగించుకోవాలి

- ఎస్పీ జాషువా

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ను ప్రజలందరూ వినియోగించుకోవాలని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. శుక్రవారం 90 లక్షల రూపాయలు విలువగల 421 మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్నవారు మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం వాట్సాప్ నెంబర్9490617573 కి హాయ్ హెల్ప్ అని మెసేజ్ పెట్టి సమాచారం పంపితే చాలు మీ మొబైల్స్ ని రికవరీ చేస్తామని అన్నారు. ఇందు నిమిత్తం ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఐటీ కోర్ సిబ్బంది, సి సి ఎస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వాటిని రికవరీ చేయడం జరుగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగపరచుకుని పోగొట్టుకున్న మొబైల్స్ తిరిగి పొందవచ్చు అన్నారు. అలాగే ఆటకాయతనంగా ఆకతాయిలు ఈ అప్లికేషన్ను దుర్వినియోగపరచుకుంటే సహాయం పొందవలసిన వారికి సహాయం అందించలేమని, ఎవరికైనా దొరికిన ఫోను దొంగతనం చేయలేదు కదా అని సొంతానికి ఉపయోగిస్తే తద్వారా కేసులలో ఇరుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అందువల్ల ఒకవేళ ఫోన్ దొరికితే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో అందజేయాలని అన్నారు.

కృష్ణాజిల్లా పోలీసుల పనితీరు భేషుగ్గా ఉంది : ఎస్పీ

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం నేరాల సంఖ్య తగ్గిందని అలాగే రికవరీ రేటు పెరిగిందని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. శుక్రవారం 2023 సంవత్సరం నేర గణాంకాల నివేదిక సమర్పణలో భాగంగా,2022 వ సంవత్సరంలో10845 కేసులు నమోదు కాగా2023 లో 9404 కేసులు మాత్రమే నమోదు అయ్యాయని, పోలీసు వారు చేపట్టిన ముందస్తు చర్యలు, కమ్యూనిటీ పోలీసింగ్ వలన హత్య కేసులు, దోపిడీ కేసులు, కన్నపు నేరాలు, దొంగతనాలు తగ్గాయని, రికవరీ శాతం పెరిగిందని, మహిళలపై నేరాల సంఖ్య కూడా తగ్గిందని, ఫోక్సో చట్టం వల్ల, మరియు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ పై బాల బాలికలకు అవగాహన కల్పించడం, మరియు ముఖ్యంగా మొబైల్ వినియోగం వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించడం వల్ల బాలికలపై లైంగిక నేరాల సంఖ్యతగ్గిందన్నారు. గంజాయి అమ్మకందారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ముగ్గురిపై పిడి యాక్ట్ ప్రయోగించి మరికొందరిపై షీట్ ఓపెన్ చేయడం ద్వారా గంజాయి సరఫరా తగ్గిందన్నారు. రహదారులపై ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉన్నచోట హెచ్చరిక బోర్డులు,బ్లింకర్స్, రేడియం స్టిక్కర్స్ తో కూడిన డ్రమ్ములు, బారిగేట్స్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు జగనన్నకు చెబుదాం కార్యక్రమం లో సివిల్ కోర్టులో ఉన్న సమస్యలు తప్ప మిగిలినవన్నీ పరిష్కరించామన్నారు. 2023 సంవత్సరం నందు ఐదుసార్లు లోక్ అదాలత్ నిర్వహించగా అందులో కృష్ణా జిల్లా పోలీస్ శాఖ తరపున 34౦89 కేసులలో రాజీ జరిగిందన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమ కొరకు పోలీస్ యూనిట్ హాస్పిటల్, మహిళల విశ్రాంతి భవనం, పోలీస్ ఇన్నోవేషన్ సెంటర్, స్పందన హాలు వంటివి నిర్మించి, ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఫిర్యాదారులకు భోజన సదుపాయం ఏర్పాటు చేసి వారికి విశ్రాంతితోపాటు సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతున్నామన్నారు. ప్రమాదవశాత్తు లేదా అనారోగ్య కారణాలతో హోంగార్డు విభాగంలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద 17 మందికి నియామక పత్రాలు అందజేశామన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము పర్యవేక్షణలో సరఫరా చేసిన 'స్ఫూర్తి' పుస్తకాలను పంపిణీ చేశారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హై స్కూల్లో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి 29 మంది పిల్లలకు అందజేసి వారికి పలు సూచనలు ఇచ్చారు. హెచ్ఎం ఎస్. వెంకట శేష సాయి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ జజ్జవరపు మంగమ్మ పాల్గొన్నారు. అలాగే మొవ్వ శ్రీమండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు సబ్బినేని సాంబశివరావు పర్యవేక్షణలో 168 మంది పిల్లలకు పంపిణీ చేశారు.కాగా మండలంలో భట్ల పెనుమర్రు, పెడసనగల్లు, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో, పెద ముత్తేవి సంస్కృత ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో చదువుతున్న 432 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేయించినట్లు ఎంఈఓటి1 ఎం శివ శంకర్ రావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్

విశాలాంధ్ర-అవనిగడ్డ : గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రరమేష్‌బాబు మాట్లాడుతూ సుదీర్ఘ ప్రయాణంలో గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎన్నో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యలను పరిష్కరించారు. నియోజకవర్గ పరిధిలో 77 సచివాలయాలను 1601 వలంటీర్లతో కలిసి 93,417 గృహాలను సందర్శించడం జరిగిందని గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్నటువంటి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. గడప గడపకి మన ప్రభుత్వం ద్వారా ఒకొక్క సచివాలయానికి గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి 20 లక్షల రూపాయలు మంజూరు చేయగా వాటి ద్వారా సచివాలయ పరిధిలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా నియోజకవర్గ పరిధిలో 15.40 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, సచివాలయాల పరిధిలో మిగిలిపోయినటువంటి సమస్యలను పరిష్కరిస్తూ ఇదే విధంగా ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్యాడ్యువిటీల కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మరియు సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం 18 వ రోజు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్స్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మించి మోసగించారని, మా మెర ఒక్క సారి ఆలకించి మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ మహిళా యూనియన్ నాయకులు, సిఐటియు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : అంగన్వాడీ కార్యకర్తల న్యాయ బద్ధమైన సమస్యలు పరిష్కరించి సీఎం జగన్మోహన్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్‌బాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. పోలినాయుడు, డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో భాగంగా శుక్రవారం చల్లపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచీ ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు ప్రధాన సెంటర్లో ధర్నాచేసి, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నేతలు మాట్లాడుతూ, ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన జగన్ వెయ్యి రూపాయలు జీతం పెంచి చేతులు దులుపుకున్నారనీ, నాలుగేళ్లుగా అంగన్వాడీ కార్యకర్తలు అడుగుతున్నా స్పందించటం లేదన్నారు. కనీస వేతనం ఇవ్వాలనీ, గ్రాట్యుటీ అమలుచేయాలనీ తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నేతలు యద్దనపూడి మధు, శీలం నారాయణరావు, వాకా రామచంద్రరావు, మహ్మద్ కరీముల్లా, మహిళా సమాఖ్య నేతలు మల్లుపెద్ది రత్నకుమారి, కంఠంనేని జ్యోత్స్నాదేవి, నేతలు జల్లూరి ప్రసాద్, మీర్ రిజ్వాన్, పరుచూరి జనార్ధన్, బండి ఆదిశేషు, మొవ్వ ప్రాజెక్టు నేత ఎస్.విజయలక్ష్మి, చల్లపల్లి సెక్టార్ నేత సిహెచ్. గంగాభవానీ, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అంగన్వాడి వ్యవస్థను నిర్వీర్యం చేయడమే ప్రభుత్వ లక్ష్యమా ?

విశాలాంధ్ర-బంటుమిల్లి :- అంగన్వాడి వ్యవస్థను నిర్వీర్యం చేయడమే ప్రభుత్వ లక్ష్యమా ? చిన్నపాటి మహిళా ఉద్యోగులమన్న కనికరంలేని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అంగన్వాడి కార్యకర్తలు ముక్తకంఠంతో నినాదాలు చేస్తూ సాక్షి దినపత్రికలను దహనం చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ బంటుమిల్లి ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 18 రోజు సమ్మెలో భాగంగా బస్టాండ్ దగ్గర శిబిరంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లుడుతూ ఈరోజు ప్రభుత్వం జనవరి 2వ తేదీ నుండి 20వ తేదీ వరకు కరోనా సందర్భంగా స్కూల్స్‌కి అలాగే అంగన్వాడీలకు సెలవు ప్రకటిస్తున్నామని, ప్రకటన చేయటం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చిలకు పిలిచి కనీస కోరికలను తీర్చాలని లేని పక్షంలో ఇంకా సమ్మెను ఉధృతం చేస్తామని వాళ్ళు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి ,కృత్తివెన్ను ,పెడన మండలాల్లోని అంగన్వాడీలు ,హెల్పర్లు పాల్గొన్నరు.

అంగన్వాడీ సిబ్బంది చప్పట్లతో మారుమోగిన మొవ్వ

విశాలాంధ్ర-కూచిపూడి : అంగన్వాడీ సిబ్బంది గత 17 రోజులుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె రిలే నిరాహార దీక్షలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ సాచివేత ధోరణి ప్రదర్శించడం ఎంతవరకు సబమని కృష్ణాజిల్లా సిఐటియు ఉపాధ్యక్షుడు ప్రశ్నించారు. మొవ్వ సిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలలోని అంగన్వాడీ కార్యకర్తలు సహాయకులు కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షల లో భాగంగా 18వ రోజైన శుక్రవారం ఆ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపరచి వారికి చేయూతనివ్వాలని సూచించారు. దీనికోసం అంగన్వాడి సంఘ నాయకులతో, వివిధకార్మిక సంఘ నేతలతో చర్చలు నిర్వహించి వారి సమ్మెను నిర్వహింప చేయడానికి చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిరాహార దీక్షలో భాగంగా సిబ్బంది చేసిన చప్పట్లు మోతతోమొవ్వ మారుమోగింది. అంగన్వాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ మొవ్వ ప్రాజెక్టు సంఘ నేతల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ శిబిరానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ కరీముల్లా, కౌలు రైతు జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు సంఘీభావం తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహశీల్దార్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో గల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి ఆదేశానుసారంఏ . ఈ. ఆర్. ఓ .గానున్న తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాదు శుక్రవారం ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. మరొక మూడు నెలల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సంబంధించిన కేంద్రాలలో సౌకర్యాలను పరిశీలించారు. అలాగే కొన్ని కేంద్రాలలో చేయవలసిన పనులపై కూడా ఆయా బి .ఎల్. ఓ. లకు సూచనలు ఇచ్చారు. మండలంలో గల 21 గ్రామపంచాయతీలలోని 54 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఉన్నత అధికారులకు నివేదిక ద్వారా రూపొందించనున్నట్లు తెలిసింది. ఆయా పోలింగ్.కేంద్రాలకు సంబంధించిన గాలి ,వెలుతురు, విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, వృద్ధులకు, దివ్యాంగులు రాకపోకలకు గల రాంపుల సౌకర్యం, పోలింగ్ కేంద్రాలభద్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొవ్వ, మొవ్వ పాలెం, వేములమడ, కోసూరు, కాజ, పద్దారాయుడు తోట తదితర ప్రాంతాలలో గల పోలింగ్ కేంద్రాలను వి.ఆర్.ఓ.లు, బి. ఎల్. ఓ. లతో కలిసి పరిశీలించారు.

చింతలగుంట రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : మండలంలోని జేమ్స్ పేట, చింతలగుంట, కట్టవాని చెరువు రహదారి చాలా సంవత్సరాల నుండి గుంటలు పడి, పాడైపోయి ఆ పై గ్రామాలనుండి రోజు గుడ్లవల్లేరు వెళ్ళే విద్యార్థులు,ఉద్యోగులు,రోజు వారి కూలీలు తీవ్ర ఇబ్బందికి గురియవుతున్నరు. ఈ సమస్యను స్థానికులు , గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే స్పందించి తన సొంత నిధులు వెచ్చించి గుడ్లవల్లేరు మండల టీడీపీ ఇంఛార్జి కొసరాజు బాపయ్య చౌదరి ఆధ్వర్యంలో మరమ్మత్తు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు ఈడే. మోహన్ మరియు గ్రామస్థులు కూడా పనిలో తోడ్పడి తమ రోడ్లను బాగుచేసుకున్నారు.

పైడమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లు భేష్ : లంకిశెట్టి

విశాలాంధ్ర-పెడన : పట్టణ గ్రామ దేవత పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవ ఏర్పాట్లు బేష్ అని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం బాలాజీ దంపతులు ఆలయాన్ని సందర్శించిఅమ్మవారికి వస్త్రాలు, పూల మాలలు, పసుపు కుంకుమ అందించారు. దేవాదాయ శాఖ ఈవో తిక్కిశెట్టి.రామ్మోహన్ రావు,19 వ వార్డు కౌన్సిలర్ సిరివెళ్ల జైయేసు లంకి శెట్టి దంపతులకు ఆలయ సిబ్బందిచే ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నం తోట వారి ఆడపడుచు గా పెడనలో వెలసిన పైడమ్మ తల్లి జాతర మహోత్సవాల కోసం వస్తున్న భక్తులకు దేవాదాయ శాఖ వారు మంచి ఏర్పాట్లు చేశారని అన్నారు. లంకిశెట్టి దంపతులు అన్నదానానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సంబరాల్లో 7,9 వ రోజు ప్రత్యేక ఆకర్షణ అని ఈ. ఓ రామ్మోహన్రావు తెలిపారు

నాలుగో రోజుకు చేరిన జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర-పెడన : పెడన పట్టణ ఇలవేల్పు గ్రామ దేవత పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున సిడిబండ్లను కట్టి మంగళ వాయిద్యాలు, నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో తిక్కశెట్టి రామ్మోహన్ రావు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాకుళపు సుబ్బారావు, తోట సాంబశివరావు, చాకరి జాముల భగవాన్ , చిల్లి ముంత శీను, సిరివెళ్ల సూర్యనారాయణ తదితరులు జాతర మహోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

బీఫార్మసీ విద్యార్థులకు గర్వ కారణం : డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : బి ఫార్మసీ విద్యార్థులు తాము చదువుతున్న కోర్స్ గురించి గర్వంగా చెప్పుకోవాలి అని జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా జి గేతాభాయి అన్నారు. శుక్రవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ ప్రథమ సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు దిశా నిర్దేశ (ఇండక్షన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఔషధాల గురించి పూర్తి స్థాయిలో జ్ఞానాన్ని సమపార్జించి సదరు ఔషదం వాడకం వల్ల కలిగే ఉపయోగాలు తో పాటు జరిగే నష్టాలు కూడా తెలుసుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో అందరూ ఇళ్ళల్లో వుంటే డాక్టర్ లు, నర్సులు, ఫార్మసీస్టులు ధైర్యంగా ముందుకు వచ్చి విధులు నిర్వర్తించారు అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న వారే జీవితంలో ముందుకు వెళతారని, ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఆ దిశ గా పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ డీన్ ఆచార్య మారుతి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి బంగారుపతకం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తమ విద్యాలయానికి చెందిన విద్యార్థి మార్షల్ ఆర్ట్స్‌లో స్వర్ణపతకం సాధించినట్లు జిల్లా గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ కన్వీనర్, విస్సన్నపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జి.జాన్సన్ దేవరాజ్ తెలిపారు. ఈనెల 24వ తేదీన చిత్తూరు పట్టణంలోని టిటిడి కల్యాణమండపంలో ఈ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి మణికంఠస్వామిని, శిక్షకుడు సత్యను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-వీరులపాడు: వీరులపాడు మండలం నరసింహ రావు పాలెం గ్రామానికి చెందిన రైతు గల్లా చిన్న పున్నయ్య గత బుధవారం ఆర్థిక బాధలతో ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. ఆత్మహత్య చేసుకున్న రైతుని ఆదుకోవటానికి విజయవాడ నగరానికి చెందిన కిసాన్ శ్రామిక్ సత్సంగ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు చుక్కపల్లి కోటేశ్వరావు, హైకోర్టు న్యాయవాది ఉప్పాల సుబ్బరాయుడు, ఫణి, ఎస్ రాజా, మజ్జి మేఘన, విజయవాడ నగర న్యాయవాది గురునాథంలు ముందుకొచ్చారు. ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడ వంట సరుకులు నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం చేసినట్లు కిసాన్ శ్రామిక్ సత్సంగ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తెలిపారు.

20 స్టేషన్‌లకు ఐఎస్ఓ సర్టిఫికేట్లు : డీఆర్ఎం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలను అందించటం పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించటానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దీంతో విజయవాడ డివిజన్‌లోని 20 స్టేషన్‌లకు ఐఎస్ఓ 14001:2015 సర్టిఫికేట్ పొందారని డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో ఐఎస్ఓ 14001:2015 సర్టిఫికేట్స్ పొందిన 20 రైల్వే స్టేషన్‌లు అయిన గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, గుడివాడ, భీమవరం టౌన్, భీమవరం జంక్షన్, నరసపూర్, కాకినాడ పోర్ట్ టౌన్.ఇన్‌చార్జ్‌లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్ఎం మాట్లాడుతూ 2026 వరకు మరో మూడేళ్లపాటు 20 రైల్వే స్టేషన్లు ఐఎస్ఓ సర్టిఫికేషన్‌కు రీ-సర్టిఫికేషన్ పొందడం విజయవాడ డివిజన్‌కు గర్వకారణమని అన్నారు.సిపిసిబి నిర్దేశించిన ప్రమాణాలలో ఈ 20 రైల్వే స్టేషన్‌లకు 2019-20లో ఉన్నాయన్నారు. ఐఎస్ఓ అనేది ఉత్పత్తి, పర్యావరణ నిర్వహణ మొదలైన నిబంధనలకు వ్యతిరేకంగా ప్రమాణాలను ధృవీకరించే సంస్థ.ప్రతి స్టేషన్‌లో పర్యావరణ కాలుష్య కారకాల స్థాయిని కొలుస్తుంది. ఎన్విరాన్మెంట్,హౌస్ కీపింగ్ మేనేజర్ ఎం కిషోర్‌ను, 20 స్టేషన్ల సిబ్బందిని అభినందించారు. ఈ పనులను మరింత ఉత్సాహంగా కొనసాగించాలని కోరారు. చెత్త పారవేయడం, చిన్న స్థాయిలో కూడా అత్యంత జాగ్రత్తగా ఉండేలా వ్యవస్థలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం డి.శ్రీనివాసరావు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ నరేంద్ర వర్మ,దేవేంద్ర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో 'ఆడుదాం ఆంధ్రా'

విశాలాంధ్ర-గన్నవరం : మండలంలో శుక్రవారం గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లో పురుషుల వాలీబాల్ మరియు మహిళల ఖో ఖో పోటీలు జరిగాయి. అలాగే కేసరపల్లిలో క్రికెట్, ఖో ఖో ముస్తాబాద లో షటిల్ బాడ్మింటన్, సూరంపల్లి లో ఖో ఖో పోటీలు గన్నవరం యం పి డి ఓ సత్య కుమార్ పర్యవేక్షణ లో ఉత్సాహంగా నిర్వహించినట్లు గన్నవరం నియోజకవర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, మరియు సచివాలయం సిబ్బంది సహకారం తో పోటీలు విజయ వంతంగా కొనసాగుతున్నట్లు నాగరాజు తెలిపారు. కాగా దావాజీగూడెం, గొల్లనపల్లి, వీరపనేనిగూడెం గ్రామాలలో సచివాలయాల స్థాయి పోటీలు ముగిసినట్లు ధనియాల వివరించారు.

పట్టణంలో పోలింగ్ కేంద్రాలు పరిశీలన

విశాలాంధ్ర-పెడన : పెడన పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో పెడన నియోజవర్గ రిటర్నింగ్ అధికారి కే రాజ్యలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. పట్టణంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఈ ఆర్ ఓ దివ్యాంగుల కోసం ర్యాంపులు, పోలింగ్ కేంద్రంలో వెంటిలేషన్, పోలింగ్ కేంద్రంలో భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. పట్టణంలో 25 పోలింగ్ కేంద్రాలు పరిశీలన పూర్తయిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిఓ ఏసుబాబు, ఆయా సచివాలయాల బిఎల్వోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని దర్శించిన ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-పెదపారుపూడి : 18 రోజులుగా వివిధ రూపాలలో నిరసన సమ్మె లో భాగంగా రిలే నిరసన దీక్ష చేస్తున్న అంగనవాడి దీక్ష శిబిరాన్ని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ శుక్రవారం దర్శించి తమ సమస్యలు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు దీక్ష చేస్తున్న అంగన్వాడి సిబ్బందికి తెలిపారు. త్వరలో ప్రభుత్వం మీ సమస్యలు పరిష్కరించుతుందని హామీ ఇచ్చినట్లు నియోజకవర్గ అంగనవాడి కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు కొడాలి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదపారుపూడి అంగనవాడి సంఘం అధ్యక్షురాలు ఎస్ జ్యోతి, వాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దీక్ష శిబిరాన్ని దర్శించిన కుమార్ రాజా

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్ఛార్జి వర్ల కుమార్ రాజా అంగనవాడి కార్యకర్తలు, వర్కర్లు గత 18 రోజులుగా చేస్తున్న రిలే నిరసన దీక్షా శిబిరాన్ని దర్శించి అంగనవాడి సిబ్బంది సమస్యలను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. సుమారు 400 మందికి భోజనాలు సమకూర్చి కుమార్ రాజా వడ్డించినట్లు పెదపారుపూడి అంగనవాడి కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు ఎస్ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షురాలు కె ఉమారాణి, సిడిపిఓ కార్యాలయ అధ్యక్షురాలు కె రత్నశ్రీ, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పోలంపల్లికి గండి

-పోలంపల్లి మునేరు ప్రాజెక్టు ఆధునీకరణ పట్ల నిర్లక్ష్యం....!

- రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి...!

-సీపీఐ జిల్లా కార్యదర్శి దొనేపూడి శంకర్, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

విశాలాంధ్ర-వత్సవాయి, పెనుగంచిప్రోలు : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వల్లనే పోలంపల్లికి మునేరు ప్రాజెక్ట్‌కు గండి కొట్టే పరిస్థితి ఏర్పడిందని, పోలంపల్లి మునేరు ప్రాజెక్టు ఆధునీకరణ పట్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందనీ, రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలనీ సీపీఐ జిల్లా కార్యదర్శి దొనేపూడి శంకర్, జగ్గయ్యపేట నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు శ్రీరాం తాతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పోలెంపల్లి మునేరు ప్రాజెక్ట్ వద్ద తెలంగాణ రైతులు అక్రమంగా తవ్విన గండిని సీపీఐ, తెలుగు దేశం, జనసేన, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జూన్‌లో కురిసిన వర్షాలకు గండి పడి కొట్టుకుపోయినదనీ, కుడి వైపున ఉన్న తెలంగాణ వైపు పాత ఆనకట్టకు రెండు చోట్ల గండ్లు పడ్డాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పడిపోయిన గోడ నిర్మాణం చేసిందన్నారు. గండ్లు పూర్చుటకు మొదట తెలంగాణ రైతులు అంగీకరించనీ పక్షంలో జగ్గయ్యపేట శాసన సభ్యులు సామినేని ఉదయభాను ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం రైతులకు ఇప్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. ఈనాటి వరకు తెలంగాణ రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందలేదని తెలిపారు. తెలంగాణ రైతులుకు నష్ట పరిహారం చెల్లించకపోవడంతో మంగళవారం తెలంగాణ మునేరు పాత ఆనకట్టకు తెలంగాణ వైపు గండి కొట్టడంతో పాత ఆనకట్ట వద్ద 0.13 టీఎంసీల నిల్వ ఉన్న నీరు వెనుకకు వెళ్లిందన్నారు. రెండు వైపులా 7.5 కి.మీ. దూరం, 75 మీటర్ల ఎత్తు కరకట్టల నిర్మాణం, బ్యారేజ్ నిర్మాణం పూర్తి అయిన యెడల ఆనకట్ట నీటి నిలువ 0.8టీఎంసీలకు పెరుగుతుందని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి గన్‌మోహన్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులు, రైతుల మీద ఎంత చిన్న చూపు ఉన్నదో తెలుస్తుందని విమర్శించారు. తక్షణమే గండి పూడ్చి రైతులకు న్యాయం చేయాలని ఆంధ్ర తెలంగాణ రైతుల మధ్య సయోధ్య కుదర్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, సీపీఐ జగ్గయ్య పేట సహాయ కార్యదర్శి బాబురావు, టీడీపీ నాయకులు, వేగినేటి గోపాలకృష్ణ మూర్తి, వాత్సవాయి మండల పార్టీ అధ్యక్షుడు వడ్డలమూడి రాంబాబు, పెనుగ్రంచి ప్రోలు మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య, పొన్నం నరసింహారావు, వల్లంకొండ బ్రహ్మం, జనసేన నాయకులూ బాడిస మురళి కృష్ణ, జనసేన వీర మహిళా కృష్ణవేణి, మునేటి నీటి సంఘం మాజీ అధ్యక్షులు యార్ల గడ్డ విశ్వనాథం, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-నందిగామ: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు, ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ,, నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. శుక్రవారం సమ్మెకు మద్దతుగా సీపీఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు సమ్మె శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు భారత్ కమ్యూనిస్టు పార్టీ మద్దతు ఉంటుందని తెలియజేశారు అనంతరం అంగన్వాడి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మెలో పాల్గొని వారికి కూడా సంఘీభావం తెలియ జేయడం జరిగింది. ఈ కార్యక్రమాలలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి,మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు పట్టణ కార్యదర్శి వేముల వీరయ్య, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు జిడ్డేపల్లి తుఫాన్ బాబు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవుని అంతరంగాన్ని తాకే హమీద్ దాల్వాయి కథలు

ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): 34వ విజయవాడ పుస్తక మహోత్సవం శుక్రవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ఓల్గా అనువాద రచన 'హమీద్ దల్వాయీ కథలు' ఖాదర్ మొహియుద్దీన్ ఆవిష్కరించి మాట్లాడుతూ మరాఠీ రచయిత హమీద్ దల్వాయి 1932 పుట్టి, 77 చనిపోయాడని జీవిత కాలంలో రాజకీయ సామాజిక రంగాలలో రచనా రంగంలో ఉంటూ కవిత్వం ఎక్కడ పోతుంది ఎక్కడ ముగుస్తుందని ఈ రెండు విషయాలపై పుస్తకాలు రాశారన్నారు. మానవుని అంతరంగాన్ని తాకే కథలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్ల వెంకట నారాయణ, సాయి వంశీ, సుస్మిత, పూర్ణిమా తమ్మిరెడ్డి, మీనా తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'తో క్రీడాకారులకు పోత్సాహం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : విద్యాధరపురం స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను యూత్ అడ్వాన్స్మెంట్ టూరిజం అండ్ కల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ ఆడి అనంతరం మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీలలో సచివాలయం పరిధిలో గెలిస్తే మండలం స్థాయిలో పోటీ ఉంటుందని, మండలం స్థాయిలో గెలిచిన వారు నియోజకవర్గం స్థాయిలో, అనంతరం జిల్లా స్థాయిలో చివరిగా రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలిచిన క్రీడా కారులను అభినందించారు. ఈ సందర్భంగా వీఎంసీ కమిషనర్ విద్యాధరపురం స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ పనితీరును పరిశీలించి ప్రతిదీ షెడ్యూల్ ప్రకారం జరపాలని, నిరంతరంగా సచివాలయం సిబ్బంది సమర్పించే నివేదికలను పరిశీలించారు. ప్రతిరోజు జరుగుతున్న మ్యాచ్‌లు, ఇప్పటికి జరిగినవి, ఇంకా జరగాల్సినవి పోటీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాధరపురం స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని రానున్న రోజుల్లో ఈ స్టేడియం ఎంతగానో అభివృద్ధి చెందనుందని, విద్యాధరపురం స్టేడియంలో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజల్లో క్రీడల్లో నైపుణ్యం పెంచేందుకు ఇదొక ప్రధాన కేంద్రంగా మారబోతున్నదని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడుదాం ఆంధ్ర పోటీలు విద్యాధరపురం స్టేడియంలో జరుగుతున్న నేపథ్యంలో పరిసర ప్రాంత ప్రజలు పోటీల్లో పాల్గొనటంతో పాటు ఆడుతున్న క్రీడాకారులను ప్రోత్సహించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ అజీజ్, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్లు కే.శకుంతల, కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, డీసీపీ జుబిన్ సిరన్‌రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రకు'తో ఉన్నత శిఖరాలకు : ఎంపిపీ కోటేరు లక్ష్మి

విశాలాంధ్ర-వీరులపాడు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఆడుదాం ఆంధ్ర" క్రీడ పోటీలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో "ఆడుదాం ఆంధ్రకు" క్రీడా పోటీలకు సంబంధించిన టీ షర్ట్స్, క్యాప్ లను మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు కూడా ఆడటం వలన భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే లక్ష్యంతోనే వైకాపా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కు క్రీడా పోటీల ను శ్రీకారం చుట్టారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి దేవి , ఏఓ రాంబాబు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవంలో నేడు

విశాలాంధ్ర-విజయవాడ : 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో మూడవ రోజు శనివారం కార్యక్రమాలు సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర పబ్లిషర్స్ వారి పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. జనాభా సంఖ్య- అపోహలు - భారత రాజకీయాలు' పుస్తకాన్ని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి వై ఎస్ ఖురేషి ఆవిష్కరిస్తారు. ముఖ్యఅతిథులుగా మైనారిటీ సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎమ్మెల్యే, విశాలాంధ్ర సంపాదకమండలి అధ్యక్షులు కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకమండలి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు తదితరులు పాల్గొంటారు.

పోలీస్ వెల్ఫేర్ డే లో 31 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పోలీస్ వెల్ఫేర్ డేలో 31 అందాయి, శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు "పోలీస్ వెల్ఫేర్ డే" కార్యక్రమాన్ని సీపీ కాంతి రాణా నిర్వహించినారు. పోలీసు సిబ్బంది నుంచి బదిలీలు, సర్వీస్ సంబంధించి వివిధ సమస్యల పై వచ్చిన ఫిర్యాదులు గురించి వారితో స్వయంగా మాట్లాడి సత్వరం సమస్యలను పరిష్కారించాలని సిబ్బందికి అదేశాలు జారీ చేశారు. పోలీస్ సంక్షేమం దృష్ట్యా నిర్వహించే ఈ పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని అవసరం ఉన్న పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమీషనర్ తెలియజేశారు.

డయల్ యువర్ సీపీకి 11 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): డయల్ యువర్ సీపీకి 11 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం జరిగే డయల్ యువర్ పోలీస్ కమీషనర్ ఎన్టీఆర్ జిల్లా దయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. ఇందుకోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా సీపీకి తెలియజేశారు. వీటిలో ట్రాఫిక్ సమస్యల గురించి, అసాంఘిక శక్తుల గురించి, కుటుంబ కలహాలుగురించి, ఆర్థికనేరాలు గురించి, స్థలం తగాదాల గురించి తదితర మొత్తం 11 కాల్స్ చేయగా పోలీస్ కమీషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ యస్.హెచ్.ఓ.లతో, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు.

సరైన విచారణ చేయకుండా ఓట్లను తొలగిస్తారు

విశాలాంధ్ర-వీరులపాడు: ఒక్క వ్యక్తి ఇచ్చిన పిటిషన్ మీద ఆధారపడి 53 ఓట్లు ఎలా తొలగిస్తారని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వీరులపాడు మండల రెవిన్యూ సిబ్బందిని ప్రశ్నించారు.జుజ్జూరు గ్రామంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో మండల తేదేపా శ్రేణులు తంగిరాల సౌమ్యతో కలిసి పెద్దాపురం లో ఓట్ల తీసివేతలో జరిగిన అవకతవకలపై వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. అనంతరం మండల కార్యాలయం ముందు కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకరులతో సౌమ్య మాట్లాడుతూ ఎవరికైనా ఒక్క ఓటు మాత్రమే వుండాలని, రెండు ఓట్లు ఉంటే మాత్రమే ఓటు తీసివెయ్యాలని అలాంటిది దేశం లో ఎక్కడ ఓటు లేకపోయినా 6 నెలలు గా ఇక్కడ నివాసం వుండటం లేదనే నెపం చూపించి ఓట్లు తొలగిస్తున్నారని ఇది హేయమైన చర్య అని ఆమె అన్నారు. బాధితులకు మళ్ళీ ఓటు కల్పించేలా అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాపా రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ టి.వీరబాబు,నిమ్మల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం కూడా పన్ను చెల్లింపు కేంద్రాలు పని చేస్తాయి

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర ప్రజలు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, ఇతర పన్నులను డిసెంబర్ 31లోగా చెల్లించాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి పన్ను చెల్లించేందుకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నదని ప్రజలు గమనించాలని తెలిపారు. ప్రజలు పన్నులు చెల్లించేందుకు వారి సౌకర్యార్థం ఆదివారం సెలవు రోజైనప్పటికీ వడ్డీ లేకుండా పనులు చెల్లించేందుకు ఆదివారం కూడా విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని క్యాష్ కౌంటర్లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

22న ఓటర్లు తుది జాబితా : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జనవరి 22న ప్రచురించనున్న ఓటర్ల తుది జాబితాకు నమోదవుతున్న దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకి వివరించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా నమోదు అవుతున్న క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, అనోమలిస్, ఫారం 6, 7, 8ల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, అధికారులు, సిబ్బంది తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు నగరంలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఢిల్లీరావు, వీఎంసీ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్‌వో నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా ఓటర్ల నమోదు, మార్పు, చేర్పులకు దరఖాస్తులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలో 27 అక్టోబర్ 2023న ప్రచురించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటి నుండి ఈనెల 9వ తేదీ వరకు ఫారం 6, 7, 8లకు సంబంధించి 1లక్ష 78 వేల 779 ధరఖాస్తులు రాగా 1లక్ష 69వేల 259 ధరఖాస్తులను అంగీకరించడం జరిగిందని వీటిలో 8,888 ధరఖాస్తులు అనర్హతగా గుర్తించి తిరస్కరించామన్నారు. ఇంకనూ పరిష్కరించాల్సిన 308 ధరఖాస్తులను పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గా పరిధిలో 1781 పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందని ఆయా పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులైన ఫర్నిచర్, లైటింగ్, టాయిలెట్స్, ర్యాంప్, త్రాగునీరు అన్ని మౌలిక వసతులు కల్పించి సిద్ధంగా ఉంచామన్నారు. పోలింగ్ నిర్వహణకు 900 మంది మైక్రో అబ్జర్వర్స్, 2137 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1959 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 7836 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు డిస్పాచ్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్, కౌంటింగ్ రూమ్‌లను గుర్తించామన్నారు. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెంచేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. 22 జనవరి 2024న ప్రచురించే జాబితా తప్పులు లేని తుది ఓటర్ల జాబితాగా ఉండేలా అన్ని స్థాయిల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.

కాంథస్ సార్కోమాతో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడికి ఏవోఐలో విజయవంతంగా చికిత్స

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడలోని కానూరులో ఉన్న అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్, రాబ్డోమియోసార్కోమాతో బాధపడుతున్న 13 ఏళ్ల బాలునికి విజయవంతంగా చికిత్స చేయడం ద్వారా క్యాన్సర్ సంరక్షణలో ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఆర్ఎంఎస్ అనేది క్యాన్సర్ అరుదైన రూపం, ఇది మృదు కణజాలాలలో, ముఖ్యంగా అస్థిపంజర కండరాలలో లేదా కొన్నిసార్లు మూత్రాశయం లేదా గర్భాశయం వంటి బోలు అవయవాలలో ఉద్భవిస్తుంది. ఇది ఏ వయస్సులోనైనా వ్యక్తులను ప్రభావితం చేయవచ్చు కానీ అతి సాధారణంగా ఇది పిల్లలలో కనిపిస్తుంది. పేషంట్ మార్చి 2022 నుండి ఎడమ కంటి లోపలి భాగంలో కంటి కాంతస్ వద్ద నొప్పి లేకుండా ఉన్న కణితిని కలిగి ఉన్నాడు. రోగ నిర్ధారణ, తదుపరి చికిత్స కోసం ఏవోఐకి వచ్చాడు. అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లోని మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయి కృష్ణ కొల్లూరు, నిపుణుల సంరక్షణలో, రోగికి కీమోథెరపీ, రేడియోథెరపీతో కూడిన సమగ్ర చికిత్స అందించడం జరిగింది. డాక్టర్ సాయి కృష్ణ యొక్క నైపుణ్యం, వ్యక్తిగతీకరించిన విధానం చిన్న పిల్లలకు సరైన సంరక్షణ, చికిత్స అందేలా చేయడంలో కీలక పాత్ర పోషించింది. విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లోని రీజినల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ విజయవంతమైన కేసు అసాధారణమైన వ్యక్తిగతీకరించిన క్యాన్సర్ సంరక్షణను అందించడంలో తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని అన్నారు.

క్రైమ్ ఏసీపీగా స్రవంతి రాయ్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): క్రైమ్ ఏసీపీగా స్రవంతి రాయ్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణాను మర్యాదపూర్వకంగా కలిశారు. తెనాలి సబ్ డివిజన్ డిఎస్పీగా పనిచేస్తూన కె.స్రవంతి రాయ్ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ క్రైమ్ ఏ.సి.పి.గా బదిలీ అయ్యారు. శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ క్రైమ్ ఏ.సి.పి.గా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన క్రైమ్ ఏ.సి.పి. కె.స్రవంతి రాయ్ పోలీస్ కమీషనర్ వారి కార్యాలయం నందు నగర పోలీస్ కమీషనర్ శ్రీ కాంతి రాణాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

గ్రామ గ్రామాన జనసేన జండా

విశాలాంధ్ర-ఎ కొండూరు: గ్రామ గ్రామాన జనసేన జెండాను జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నామని తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాస్ అన్నారు. ఏ.కొండూరు మండలంలోని దీప్లానగర్ నగర్ తండా, కృష్ణారావు పాలెం, రామచంద్రపురం గ్రామాల్లో గురువారం రాత్రి జనసేన పార్టీ నిర్వహించిన సభల్లో తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న జన సైనికులు జనసేన పార్టీని బలోపేతం చేసే దిశగా కలిసికట్టుగా తెలుగుదేశం పార్టీతో కలిసి పనిచేసి రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. అనంతరం కృష్ణారావు పాలెం గ్రామ తెలుగుదేశం సీనియర్ నాయకులు ఖాదర్ బాబా ని మరియు పిన్నమనేని శ్రీనివాసరావు (అబ్బు)ని స్వగృహాలకెళ్ళి కలిసి గ్రామంలో తెలుగుదేశంపార్టీ, జనసేన పార్టీ ఉమ్మడి కార్యాచరణలో భాగంగా చేపట్టవలసిన కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది. అనీ ఆయన అన్నారు తెలుగుదేశం జనసేన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఈ సందర్భంగా జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ రాథోడ్, భూక్య చిరంజీవి, బానోతు రఘు, మురళీకృష్ణ, తరుణ్, రవి ,రాంబాబు, మండల కార్యవర్గ సభ్యులు ముదిగొండ సాయి కృష్ణ రావుల కోటేశ్వరరావు, నాగేంద్రబాబు, వల్లారపుపూర్ణ, శ్రీకాంత్, చరణ్ తేజ, తెలుగుదేశం నాయకులు షేక్ యాసిన్, షేక్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు హాజరుకండి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అంతర్జాతీయ తెలుగు మహా సభలకు హాజరుకావాలని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి కే.అనురాధ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావును ఆహ్వానించారు. తెలుగు భాష వైభవాన్ని విశ్వ వ్యాప్తం చేసే దిశగా జనవరి 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాజమహేంద్రవరంలో జరిగే 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల సందర్భంగా ఆమె శుక్రవారం కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రెండేళ్లకు ఒకసారి అంతర్జాతీయ తెలుగు మహాసభలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మహాసభలు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో విజయవంతంగా నిర్వహించటం జరిగిందని, అదే స్ఫూర్తితో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీరాజ రాజ నరేంద్రుల పట్టాభిషేక మహోత్సవ సహస్రాబ్ది సందర్భంగా సాంస్కృతిక రాజధానిలో ఈ మహాసభలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించటం జరిగిందన్నారు. రాజమండ్రిలోని గోదావరి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో మహాసభలు నిర్వహించటం జరుగుతుందని, ఈ వేదికపై హరికథ, బుర్రకథలు, యక్షగానం, అవధానం, పౌరాణిక, సాంఘీక నాటకాలు, వాగ్గేయకార సంగీతం, లలిత చలనచిత్ర జానపద సంగీతం, ఆంధ్ర, కూచిపూడి నృత్యాలు, సంచార జాతుల కళాప్రదర్శనలు నిర్వహించటం జరుగుతుందని వివరించారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT MYLAVARAM.
O.S. No. 138/2022

Between:-
Pilli Venkata Kiran - **Plaintiff**
And
1. Garemalla Kishore
2. Mahammad Sadiq
3. Kolusu Ganga Raju
4. Gunduboina Subba Rao
5. Kolusu Rama Devi - **Defendants**

Defendant No.1
Garemalla Kishore Kumar,
S/o. Sambasiva Rao, Hindu, aged about 43 years, Properties, R/o Mylavaram Village and Mandal, NTR District.

Please take notice that the above suit filed by the Plaintiff for the Declaration and other reliefs in respect of the suit schedule Property, the same is stands posted for your appearance on **25-01-2024 at 10.30 AM** and to answer the same.

If no appearance is made on your behalf, by yourself or your pleader, in this suit on the date and day mentioned hereunder, it will be heard and decided in your absence.

Hearing date: 25-01-2024.

//By Order of the Court//

A.D. PRASAD, M.A. (PPM), B. L.,
Advocate for the Plaintiff.,
Mylavaram (PO)(M), NTR Dist - 521230.
cell : 9848214992.
Mylavaram, Dated:27-12-2023.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు పిరమిల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి సూచనలు పొంది ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయు నదేమనగా, మాదవరపు మాలకొండయ్య గారి కుమారుడు వెంకట రాజేంద్రకుమార్ గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తులు 1వ అయిటంను 1)వద్దమాను మల్లేశ్వరరావు, తండ్రి. వెంకయ్య, 2)వద్దమాను శివకుమారి, భర్త. మల్లేశ్వరరావు మరియు 2వ ఐటంను వద్దమాను మల్లేశ్వరరావు, తండ్రి వెంకయ్య, 4)మాదాల నలిని రాణి, భర్త. శివ మాణిక్యాలరావు, గార్ల వద్ద నుండి కొనుగోలు నిమిత్తం ఋణం కొరకు సంప్రదించినారు. గతంలో సిండికేట్ బ్యాంకు తరపున రీజనల్ మేనేజర్ గారు ది.06-03-2019న పాత విక్రయ దార్లకు సర్టిఫైడ్ కాపీ ఆఫ్ టైటిల్ డీడ్ డెలివరి గురించి (రిజిష్టర్ ద.నెం.1188/2001 తేది.30-03-2001, యస్.ఆర్.ఓ. ఇబ్రహీమ్‌పట్నం తాలూకు బుకింగ్ హామ్‌పేట బ్రాంచ్ తరపున) లెటరు పంపించియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తుల పై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు వగైరాలు వున్నయెడల 14 రోజులలోపు తెలియజేయుగలరు. గడువు లోగా ఎట్టి క్లెయిములు రానియెడల షెడ్యూలు ఆస్తిని నిష్పేచి ఆస్తిగా భావించబడును.

షెడ్యూలు: అయిటం నెం.1:కృష్ణా జిల్లా, ప్రస్తుతం యన్.టి.ఆర్. జిల్లా, గొల్లపూడి గ్రామ పంచాయితీ, గొల్లపూడి గ్రామ రీ-సర్వే నెం.103, యల్.పి. నెం.2/2001 దాఖలా ప్లాట్ నెం.28లో చ.గ.250-55లు మింజుమలె దక్షిణపు దరి చ.గ.115లు ఖాళీ స్థలము యావద్విశిష్టములతో సహా హద్దులు.**తూర్పు:**యల్.పి. నెం.24/94 ఖాళీ స్థలం, అ.18-83లు, **దక్షిణం:** ప్లాట్ నెం.27, అ.55లు, **పడమర:** అ. 40లు వెడల్పురోడ్డు, అ.18-83లు, **ఉత్తరం:** ప్లాట్ నెం.28లో భాగం అ.55లు.

అయిటం నెం.2: డిటో షెడ్యూలు దాఖలా ఉత్తరపు దరి చ.గ. 135.55లు స్థలము యావద్విశిష్టములతో సహా హద్దులు. **తూర్పు:** యల్.పి. నెం.24/94 ఖాళీ స్థలం, అ.18-83లు, **దక్షిణం:** ప్లాట్ నెం.28లో భాగం,అ.55లు, **పడమర:**అ.40లు వెడల్పురోడ్డు, అ.18-83లు, **ఉత్తరం:** ప్లాట్ నెం.29 అ.55లు.

కె. ప్రమీల, అడ్వకేట్
చంద్రమౌళీనగర్, గుంటూరు. సెల్: 9985037449
గుంటూరు తేది: 29-12-2023

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

ఎన్.టి.ఆర్.జిల్లా, మైలవరం మండలం, వెల్వడం గ్రామ శివారు లక్కిరెడ్డి పాపులమ్మ కాలనీ నివాసి **బెల్లపు రత్తయ్యగారి కుమారుడు వెంకటేశ్వరరావుకు** చెందిన ఇండియన్ **పాస్‌పోర్ట్ నెం. A 3954417** ఒరిజినల్, ఇల్లు మారుతుండగా ఈ నెల 15వ తేదీన ఎక్కడో జారిపోయినది. కావున బెల్లపు వెంకటేశ్వరరావు ఒరిజినల్ పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెలుపగలరు.

బెల్లపు వెంకటేశ్వరరావు
తండ్రి రత్తయ్య, ఎల్.పి.కాలనీ, వెల్వడం,
మైలవరం మండలం,
ఎన్.టి.ఆర్.జిల్లా-521230.
సెల్ : 9701357679

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

ఎన్.టి.ఆర్.జిల్లా, జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామ నివాసి **శెట్టి కోటేశ్వరరావు గారి కుమారుడు ఆదినారాయణకు** చెందిన ఒరిజినల్ **పాస్‌పోర్ట్ నెం. M 6478199** పోయినది. సదరు ఆదినారాయణ వెంకటాపురం నుండి విజయవాడ వెళుతుండగా పదిరోజుల క్రితం మార్గమధ్యంలో ఒరిజినల్ పాస్‌పోర్టు ఎక్కడో జారిపోయినది. కావున ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రస్సుకు తెలుపగలరు.

శెట్టి ఆదినారాయణ,
తండ్రి కోటేశ్వరరావు, వెంకటాపురం గ్రామం,
జి.కొండూరు మండలం, ఎన్.టి.ఆర్.జిల్లా.
సెల్ : 7382412324

‘అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్’లో ప్రత్యేకతలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు ప్రయాణాన్ని వినూత్నమైన పుష్-పుల్ విధానం ప్రయాణీకులకు వేగం, సామర్థ్యం, సౌకర్యవంతంగా చేయటానికి ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని సూపర్‌ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లలో కొత్త కేటగిరీ-అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్-ని జెండా ఊపి ప్రారంభం చేయనున్నారు.అందులోని ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ డివిజన్ మీదుగా వెళ్ళనున్నదని విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రైలు మాల్దా టౌన్ - శ్రీ ఎం. విశ్వేశ్వరయ్య టెర్మినస్ (బెంగళూరు)కు వెళ్ళుతుందని మన డివిజన్‌లో ఈ రైలు మన డివిజన్‌లో తుని, సామర్లకోట్, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ,తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరులో స్టేషన్లలో ఆగుతుందన్నారు ఈ రైలు ప్రయాణీకులకు వేగవంతమైన, అనుకూలమైన, సురక్షితమైన అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణం అందిస్తుందన్నారు. అమృత్ భారత్ రైలు ప్రత్యేకతలు......దేశంలోని సూపర్ ఫాస్ట్ ప్యాసింజర్ అధునాతనమైన రైళ్లలో ఒకటిగా ఉంటుంది. 22 కోచ్‌లతో కూడిన ఎల్‌హెచ్‌బి పుష్-పుల్ రైలు, వీటిలో 12 నాన్-ఎయిర్ కండిషన్డ్ స్లీపర్ క్లాస్, 8 జనరల్ అన్‌రిజర్వ్డ్ క్లాస్ ఈ రైలు చివర్లలో రెండు లోకోలను కలిగి ఉంటుందన్నారు. ప్రయాణీకులకు సౌందర్య వంతంగా ఆకర్షణీయంగా రూపొందించబడిన సీట్లు, మెరుగైన లగేజీ రాక్, స్నాక్ టేబుల్, తగిన మొబైల్ హోల్డర్‌తో మొబైల్ ఛార్జింగ్ పాయింట్,ఎల్‌ఈడీ లైట్లు,సీసీటీవిలు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటి మెరుగైన సౌకర్యాలు ఉంటాయన్నారు.ఇది ఆహ్లాదకరమైన కలర్ బ్లెండింగ్,ఆటోమేటిక్ పరిశుభ్రత వాసన నియంత్రణ వ్యవస్థతో మెరుగైన లావెటరీని అందిస్తుంది. ఎలక్ట్రికల్ క్యూబికల్‌లో ఏరోసోల్ ఆధారిత అగ్ని మాపక వ్యవస్థ,రేడియం ఇల్యూమినేషన్ ఫ్లోరింగ్ స్ట్రిప్,జెర్క్ ఫ్రీ జర్నీ కోసం జెర్క్ ఫ్రీ కప్లర్,ఒక కోచ్ నుండి మరొక కోచ్‌కు వెళ్లేందుకు వీలుగా విస్తృత గ్యాంగ్‌వేలు ఉంటాయన్నారు. సాధారణ ప్రయాణికులకు అనువైన ధరలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో ఏడిఆర్‌ఎం డి.శ్రీనివాసరావు (మౌలిక సదుపాయాలు), సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు వావిలపల్లి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం మంద్రుప్‌కర్ పాల్గొన్నారు.

భూమి హక్కుల చట్టం 2022ను రద్దు చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల చట్టం 2022 ను వెంటనే రద్దు చేయాలని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ నెలలో అమల్లోనికి తెచ్చిన ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023(ఆంధ్ర ప్రదేశ్ భూమి హక్కుల చట్టం 2022) రాష్ట్ర ప్రజల పాలిట యామపాసం కాబోతుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ప్రజలకు తెలియచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల్లో ప్రజలతో మమేకమై సేవలు చేసిన రిజిస్ట్రేషన్ వ్యవస్థ రెవెన్యూ వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఇక మూతపడబోతున్నాయని పై తెలిపిన చట్టం ప్రకారం భూ ప్రాధికార సంస్థ టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్‌ఓ) నియమితమైన తరువాత ప్రజల తాలుకా స్థిర ఆస్తులన్ని అటు టీఆర్‌ఓ పరిధిలోనికి పోతాయని, భూ యజమాని అమ్మాయికి పొలం ఇస్తూ ధానా పట్టా దస్తావేజు రాయించాలంటే టీఆర్‌ఓ నుండి అనుమతి పొందాలని మీ అవసరాలకు మీ ఆస్తి అమ్ముకోవాలంటే టీఆర్‌ఓ అనుమతి కావాలని మీరు బాకీ రాబట్టుకోవడానికి కోర్టు నుండి తనకా డిక్రి పొందితే దానిని టీఆర్‌ఓ దగ్గర తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, సదరు డిక్రిని అమలు పరచమని కోర్టుకు వెళ్ళాలంటే టీఆర్‌ఓ నిర్భయంత్ర పత్రం ఇవ్వాలని స్థిరాస్తి కొనుకుంటే రిజిస్ట్రేషన్ చేయించుకున్న తరువాత దానిని టీఆర్‌ఓ దగ్గర నమోదు చేయించుకోవాలని, మీ ఆస్తికి సంబంధించి టిర్‌ఓ చేసినదే తుది నిర్ణయం అన్నారు. దానిని మీరు సాధారణ సివిల్ కోర్టులలో సవాల్ చేయడం కుదరదు అని, మీ ఆస్తిని కానీ టీఆర్‌ఓ ఎట్టి పరిస్థితిలోనైనా తన వద్ద నున్న వివాదాల నమోదు రిజిస్ట్రర్‌లో కనుక చేర్చినట్లయితే సదరు చేరికను మీరు హై కోర్టులో తప్ప క్రింది కోర్టులలో సవాల్ చేయడానికి వీలు కాదన్నారు. టీఆర్‌ఓ నియమితమైన తరువాత పెండింగ్లఓ ఉన్న దావాలను కూడా టీఆర్‌ఓ పరిధిలో ఉంచి నమోదు చేయించుకోవాలని, మీకు భిన్నంగా ఎదైనా కోర్టు తీర్పు వచ్చిన తరువాత సదరు తీర్పును పై కోర్టులో అపీల్ చేయాలంటే టీఆర్‌ఓ దగ్గర ముందుగా నమోదు చేయించుకొని ధృవపత్రాన్ని సదరు అపీల్‌తో జతపరచి మాత్రమే అపీల్ చేసుకోవాలన్నారు. మీ ఆస్తికి సంబంధించి ఇక ముందు మీరు ప్రతిక్షణం టీఆర్‌ఓ కనుసందానంలో మాత్రమే బ్రతకాల్సి ఉంటుందని, టీఆర్‌ఓ మాత్రం స్థానిక శాసన సభ్యుడు లేక పార్లమెంట్ సభ్యుడు చేతిలో ఉంటాడని అధికార పార్టీ కొమ్ముకాస్తూ ఇక ముందు ప్రతి పౌరుడు బ్రతుకు బానిస బ్రతుకుగా మారిపోతుందన్నారు. రిజిస్ట్రేషన్, రెవెన్యూ, కోర్టు సిబ్బంది, న్యాయవాదులందరూ కలిసి లక్ష మంది పైగా చేయలేని పనులన్నీ ప్రభుత్వం నియమించబోయే ఏ మాత్రం న్యాయ పరిజ్ఞానం లేని 5 లేక 6 వందల మంది టీఆర్‌ఓ లు చక్కబెట్టగలరనుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఇప్పటికే ఈ విషయంపైన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలియచేస్తున్నారని, ఈ సమస్య ఏ ఒక్కరిది కాదని, ప్రజలందరి సమస్య అని పరిష్కరించుకోవలసిన భాధ్యత కూడా ప్రజలందరిది అని, వెంటనే ప్రభుత్వం స్పందించి చట్టాన్ని రద్దు చేయాలని జనసేన పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ప్రచారం

విశాలాంధ్ర-అవనిగడ్డ : తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తూ వివరించారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారింటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ మహనాడు వేదికగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలైన మహా శక్తి పథకాలు, అన్నదాత సుఖీభవ, యువగళం నిధి, ఇంటింటికి మంచి నీరు, బిసి రక్షణ చట్టం గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. చంద్రబాబు పేదల కోసం వారి కడుపులు నింపడం కోసమే చంద్రబాబు తెచ్చిన అన్న క్యాంటిన్‌లు, పండుగ కానుకలు, పెళ్ళి కానుక వంటి పథకాలను అమలు చేశారని, అటువంటి పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డి పేదల మనిషా అని ప్రశ్నించారు. పేదవారు బాగుండాలన్నా, కడుపు నిండా తిండి తినాలన్నా చంద్రబాబు అధికారంలోనికి రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏపి లోని పాలన అభివృద్ధి, వినాశనం గురించి పొరుగు రాష్ట్రాలు హేలన చేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డికి కనీసం సిగ్గు అనిపించడం లేదా అని ఆర్.టీ.సి చార్జీలు, విద్యుత్ చార్జీలు పెంచి పేదలను దోచుకుంటున్న జగన్‌కు పేదల మనిషి అని చెప్పుకునే అర్హత లేదన్నారు. జగన్‌రెడ్డిని రాష్ట్రం నుండి తరిమి కొట్టేందుకు ప్రజలంతా సిద్దంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎం.పి.పి బండె కనకదుర్గ, పట్టణ పార్టీ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, బిసి నాయకులు లుక్కా శ్రీనివాసరావు, మోగావత్తు గోపి, మైలా హరిబాబు, యలవర్తి ఆది, బర్మా శ్రీను, కోట సాయి, రేపల్లె అంకినీడు, కొండవీటి గోవిందులతో పాటు కనగాల రాధ, కమ్మిలి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిక్‌లో జేఎన్టీయూ క్రికెట్ జట్టు ఎంపిక.

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ క్రికెట్ జట్టు ఎంపిక ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ తెలిపారు. క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియలో జెఎన్టియుకె పరిధిలోని ఐదు జిల్లాలకు సంబంధించి 35 కళాశాలలకు చెందిన మొత్తం120 క్రీడాకారులు పాల్గొన్నారు. క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియకు జే యన్ టి యు నరసరావుపేట నుండి డాక్టర్ జిపి రాజుతో పాటు సెలక్షన్ కమిటీ మెంబర్స్ గా ఎన్ వీ రాజ్ కుమార్, వివి ఫణీంద్ర వ్యవహరిస్తున్నట్లు మిక్ ఇంజనీరింగ్ కళాశాల పిడి నిమ్మగడ్డ సౌరయ్య తెలిపారు. ఎంపిక కాబడిన జట్టు మిక్ కళాశాలలో శిక్షణ పొంది జనవరి 7 నుండి తమిళనాడు హిందుస్థాన్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. సెలక్షన్ ప్రక్రియను కళాశాల యాజమాన్య సభ్యులు ఎం. సుహాస్, సీఈఓ డి. పాండు రంగారావులు ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు పీడీలు ఎస్ సురేష్, వెంకటరమణలు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించని ఉత్పత్తుల్లో పెట్టుబడులు వద్దు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తుందని ఎన్ఎస్ఈ ఎండి, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ అన్నారు. ‘వివేకం, శ్రద్ధతో ఆర్థిక వృద్ధికి సంబంధించిన ప్రయాణాన్ని ప్రారంభించమని ఎన్ఎస్ఈ మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. నమోదిత మధ్యవర్తులతో మాత్రమే లావాదేవీలు నిర్వహించండి. క్రమబద్ధీకరించని ఉత్పత్తులలో ఎప్పుడూ పెట్టుబడి పెట్టకండి. స్టాక్ మార్కెట్ ద్వారా చేసే పెట్టుబడి దీర్ఘకాల సంపద సృష్టి కోసం ఉద్దేశించబడింది. ఒక ఇబ్బందికరమైన అనుభవం అత్యంత స్థిరంగా ఉన్న పెట్టుబడిదారులను కూడా నిరుత్సాహపరుస్తుంది. మీరు స్టాక్ మార్కెట్‌కు కొత్తవారైనా లేదా నిపుణుడు కాకపోయినా జాగ్రత్తగా నడవడం చాలా కీలకం. అధిక రిస్క్ డెరివేటివ్స్ లేదా స్టాక్ మార్కెట్‌లో తరచుగా వర్తకం చేయడం వల్ల కలిగే నష్టాలను నివారించండి. భారతదేశ వృద్ధి కథనంలో నిబద్ధతతో పాల్గొనండి. ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయండి. గత అనుభవాల ఆధారంగా చూస్తే, దీర్ఘకాలిక పెట్టుబడులు సాధారణంగా మెరుగైన ఫలితాలను ఇస్తాయి. 2024 సంతోషంగా, సంపన్నంగా ఉండాలని కోరుకుంటున్నాను’ అని పేర్కొన్నారు.

తిరుపతమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌ను సత్కరించిన కాటేపల్లి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాస్ను శుక్రవారం ఆయన ఛాంబర్లో కాంట్రాక్టర్ కాటేపల్లి. రవికుమార్ పూలమాలల తో శాలు వతో ఘనంగా సత్కరించారు.శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం వద్ద పలు అభివృద్ధి నిర్మాణ పనులు కాంట్రాక్టర్ అయినటువంటి కాటేపల్లి రవి కుమార్. చైర్మన్ ఛాంబర్ లో జంగాల శ్రీనివాసుని కలిసి పూలదండలతో ఘనంగా సత్కరించి స్వీట్లు తినిపించారు.. ఈ సందర్భంగా చైర్మన్ జంగాల శ్రీనివాస్ కాంట్రాక్టర్ కాటేపల్లి రవికుమార్ కి ధన్యవాదాలు తెలియజేశారు.

నగరానికి ఇష్టమైన డెజర్ట్‌ను వెల్లడించిన స్విగ్గీ నివేదిక

విశాలాంధ్ర-విజయవాడ : భారతదేశంలోని ప్రముఖ ఆన్-డిమాండ్ కన్వీనియన్స్ ప్లాట్‌ఫారమ్ అయిన స్విగ్గి, శుక్రవారం విజయవాడలో ఫుడ్ డెలివరీలో టాప్ ట్రెండ్‌లను హౌ ఇండియా స్విగ్గ్'డ్ 2023 నివేదికతో పంచుకుంది. ఈ నివేదిక విజయవాడలోని పాక వైవిధ్యం, సౌలభ్యం కోసం నగరంపై పెరుగుతున్న ప్రేమను ప్రదర్శిస్తుంది. నగరంలో ఫుడ్ డెలివరీ కోసం స్విగ్గి ఎంపిక చేసుకునే ప్లాట్‌ఫారమ్ అయితే డిన్నర్-టైమ్ ఫుడ్ డెలివరీలు నగరంలో అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఇందులో బిర్యానీ వంటి వంటకాలు, అప్రికాట్ డిలైట్ వంటి డెజర్ట్‌లు ఎక్కువగా ఆర్డర్ చేయబడ్డాయి. నగరానికి చెందిన ఒక ఉత్సాహభరితమైన ఆహార ప్రియుడు రూ.15,399 విలువైన ఒకే ఆర్డర్‌ని ఇచ్చాడు. వంటల క్రానికల్స్ - 2023లో స్విగ్గీ నుండి విజయవాడ ఏమి ఆర్డర్ చేసింది. బిర్యానీ, సౌత్ ఇండియన్ కంఫర్ట్ ఫుడ్‌తో విజయవాడ ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది.

అల్టిమా ప్రొటెక్ నూతన టీవీ సి విడుదల చేసిన ఏషియన్ పెయింట్స్

విశాలాంధ్ర-విజయవాడ : ఏషియన్ పెయింట్స్ విప్లవాత్మకమైన బైయటి గోడ పెయింట్, అల్టిమా ప్రొటెక్ అనేది అల్టిమేట్ ‘లామినేషన్ పెయింట్’గా నిలుస్తుంది. ఇది భారి వర్షం, ఎండ, ధూళి నుంచి చాలా జాగ్రత్తగా కాపాడుతుంది. ఈ కొత్త ప్రకటనతో, అల్టిమా ప్రొటెక్ ఉత్తమ లామినేషన్ పెయింట్ అనే అంశాన్ని ఏషియన్ పెయింట్స్ బలపరిచింది. ప్రముఖ దక్షిణాది హాస్యనటుడు సతీష్ ముత్తుకృష్ణన్‌ను ‘చంద్రు’గా చూపించిన ఈ ప్రకటన అల్టిమా ప్రొటెక్‌లోని అనూహ్య లక్షణాలను హాస్యభరితంగా చూపుతోంది. ఈ ప్రకటన అత్యాధునిక లామినేషన్ గార్డ్ టెక్నాలజీని కూడా హైలైట్ చేస్తుంది. ఇది వినియోగదారులకు దీనిని ముఖ్య ఎంపికగా మారుస్తుంది. ఒగిల్వీ ఇండియా రూపొందించింది.టీవీసీ ప్రసారం చేస్తోంది. ఇందులో చంద్రుది ప్రధాన పాత్రగా, గర్వించదగిన ఇంటి యజమాలా ఈ మధ్య కాలంలో తన ఇంటికి అల్టిమా ప్రొటెక్, లామినేషన్ పెయింట్‌ను వేసారని చూపుతోందని ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ సింగల్ చెప్పారు.

అన్నదానంకు రూ.50,116, గోసంరక్షణకు రూ.1116 విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లో జరుగు అన్నదానం కు తిరుపతమ్మ అమ్మ వారి గోశాల లోని గోవుల సంరక్ష ణ కు తెలంగాణ రాష్ట్రం వరంగల్ పట్టణం బ్యాంక్ కాలనీ వాస్తవ్యులు కాశెట్టి శ్రీనివాస్ శైలజ దంపతులకుమారుడు. కా శెట్టి రాజీవ్ ఆలయ కార్యనిర్వహణ అధికారి కె రమేష్ నాయుడు సూచనల మేరకు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నిత్య అన్నదాన పథకమునకు 50,116 రూపాయలు గోసంరక్షణకు 1116 రూపాయలు విరాళముగా ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ కు శుక్రవారం అందజేశారు వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదములు అందజేసినారు.

డిజిటల్ డోర్ నెంబర్స్ ఓటర్ లిస్టు తయారు చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఓటర్ లిస్ట్‌ను డిజిటల్ డోర్ నెండర్‌ను డీకోడ్ చేసి అంకెలతో కూడిన డోర్ నెండర్స్‌తో ఓటర్ లిస్ట్ తయారు చేయాలని టీడీపీ మాజీ కార్పొరేటర్, పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య కోరారు. ల్యాండ్ సెటిల్మెంట్ ప్రభుత్వ కార్యాలయంలో జరిగిన సమావేశంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల హాజరైయ్యారు. ఈ సందర్భంగా రామయ్య ఓటర్ లిస్ట్ లో డిజిటల్ డోర్ నెంబర్స్ ను డీకోడ్ చేసి అంకెల తో కూడిన డోర్ నెంబర్స్ తో ఓటర్ లిస్టు తయారు చేయాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ రాజశేఖర్ కి వినతి పత్రాన్ని అందజేశారు, ఓటర్ లిస్ట్ లలో డిజిటల్ కోడ్ నెంబర్స్ తో కూడిన ఓట్లను డీకోడ్ చేసి అంకెలతో కూడిన నెంబర్లను ముద్రిస్తే ఓటర్లు ఎక్కడ ఉండేది తెలుసుకోవచ్చన్నారు. అదే విదంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను పోలింగ్ స్టేషన్ దగ్గరికి వెళ్లే మార్గం సులభం అవుతుందన్నారు.

ఉన్నత చదువుల వారధి జగనన్న విద్యాదీవెన

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జగనన్న విద్యాదీవెన పథకం ఉన్నత చదువుల వారధిలాంటిదని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసిక జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందరద్భంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కును అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఫీజులు చెల్లించే సమయానికి చేతిలో డబ్బులేక ఇబ్బంది పడే పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఎంతో దాహదపడుతుందన్నారు.ఈ కార్యక్రమం ద్వారా పేద విద్యార్థులు చదువును కొనసాగిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి 31,482 మంది విద్యార్థులకు రూ.25.53కోట్లు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ శైలజారెడ్డి, సోషల్‌వెల్ఫేర్ డీడీ విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రుక్మాంగదయ్య, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక గుంటూరు మెడికల్ కళాశాల ఆవరణలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ)గుంటూరు జిల్లా కార్యాలయం నందు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా అధ్యక్షతన శుక్రవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరి క్రమబద్ధీకరణ పక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని, వారికి నూతన పీఆర్సీ-2020 స్కేల్స్ వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను అమలు చేసి ఉద్యోగులలో ఆనందాన్ని, వారి కుటుంబ సభ్యుల్లో నూతన వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇచ్చి సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా షాఖాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, నగరశాఖ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, ఓపిఎస్ సాధన సమితి డిప్యూటీ కో-ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో సగరులను ఒకే పేరుతో పిలవాలి

విశాలాంధ్ర-మంగళగిరి : భారత దేశంలో వివిధ పేర్లతో పిలవబడు తున్న సగరులను సంఘటితం చేసి, సగర భగీరథ అనే ఒకే పేరుతో పిలవాలని కోరుతూ ఢిల్లీలో ఫిబ్రవరి 29వ తేదీన శ్రీ సగర భగీరథ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే సగరుల బహిరంగ సభను జయప్రదం చేయాలని చేపట్టిన భగీరథ జన్ కళ్యాణ్ బస్సు యాత్ర శుక్రవారం మంగళగిరి గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకుంది. అనంతరం కమ్యూనిటీ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో ట్రస్ట్ నేషనల్ కోఆర్డినేటర్ హరీష్ చౌహాన్ మాట్లాడారు. దేశంలో సుమారు 20 కోట్ల మంది ఉన్న సగరులు ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడిపోయారన్నారు. దేశంలోని సగరులను ఒక తాటిపైకి తెచ్చేందుకు సెప్టెంబర్ 27న ఢిల్లీలో బస్సు యాత్ర ప్రారంభించి, అన్ని రాష్ట్రాలలో యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. దేశం లోని సగరులు ఢిల్లీలో జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. గంగా భగీరథ సగర సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివ రావు, జూట్రు ఏడుకొండలు, కర్నాటి శివ సత్యనారాయణ, ధూపాటి రామకోటేశ్వరరావు, కలవకొల్లు వెంకయ్య, కటారి విష్ణుమూర్తి, గండికోట అచ్చయ్య, నంగళం ప్రసాద్, కగ్గా శ్రీనివాసరావు, గండికోట హేమ కుమార్ పాల్గొన్నారు.

హామీలపై మభ్యపెడుతున్న వైసీపీ నేతలు

విశాలాంధ్ర-గుంటూరు : 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99.5 శాతం పూర్తి చేశామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆరోపించారు. శుక్రవారం అర్బన్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మూడు నెలలు ఆగితే తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. జగన్ రెడ్డి మాటల మనిషే గానీ, చేతల మనిషి కాదని అన్నారు. ఒక్క ఛాన్స్ అని రాష్ట్రాన్ని జగన్ రెడ్డి నాశనం చేశాడన్నారు. మళ్లీ పొరపాటున జగన్ వస్తే రాష్ట్ర ప్రజలకు గంజాయి తినిపిస్తాడన్నారు. మద్యాన్ని నిషేధించాకే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్న జగన్ రెడ్డి, కల్తీ మద్యం ఏరులైపారిస్తూ మద్యం అమ్మకాల ఆదాయం తాకట్టుపెట్టి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చాడన్నారు. ఆడుదాం ఆంధ్రా అంటూ డబ్బులు దండుకుంటున్నాడని, ఈ కొత్త స్కామ్‌ను ప్రజలు గ్రహించాలని అన్నారు. అధికారంలోకి రాగానే రూ.3 వేల పింఛన్ అని చెప్పి, చివరి మూడు నెలలు రూ.3 వేలు ఇవ్వడం మోసం కాదా అని ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ జగన్ రెడ్డి మోసకారితనాన్ని తెలుసుకోవాలన్నారు.

డాక్టర్ కార్తీక్‌కు హియోషి యంగ్ లీఫ్ అవార్డు

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఎన్విరాన్మెంట్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్‌కు హియోషి గ్రూప్ ఏటా శాస్త్రవేత్తలకు అందించే ప్రతిష్టాత్మక యంగ్ లీఫ్ అవార్డు లభిం చింది. పర్యావరణ సంబంధ పరిశోధనల్లో విశేషమైన సేవలు అందిస్తున్నందుకు గాను 2023 సంవత్సరానికి డాక్టర్ కార్తీకన్‌ను ఎంపిక చేసి హియోషి కంపెనీ అవార్డును ప్రకటించింది. గురువారం మధ్యా హ్నం డాక్టర్ కార్తీక్ అవార్డును అందుకున్నారు. డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ గడచిన నాలుగేళ్లుగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పర్యావరణ శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. బోధన, రీసెర్చ్ రంగాల్లో డాక్టర్ కార్తీక్ ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. ఇటీవలనే ఆయనకు యంగ్ సైంటిస్ట్ అవార్డు కూడా లభించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ అరోరా శుక్రవారం డాక్టర్ కార్తీక్‌ను అభినందించారు.

పేద విద్యార్థులకు వరం ‘జగనన్న విద్యాదీవెన’

విశాలాంధ్ర-గుం టూరు వైద్యం : నిరుపేద విద్యా ర్థులకు గొప్ప వరం జగనన్న విద్యా దీవెన అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజనల్ కో-ఆర్డినేటర్ విఠల్ పేర్కొన్నారు. జూలై-సెప్టెంబర్ 2023 త్రైమాసికానికి సంబంధించి 8,09,039 లక్షల మంది విద్యార్థులకు రూ.584 కోట్ల రూపాయల లబ్ధిని చేకూరుస్తూ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో బటన్ నొక్కి విద్యార్థులు, తల్లుల జాయింట్ ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు గుంటూరు విద్యార్థి లోకం మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. వినోద్, విఠల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏసీ కళాశాల ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వినోద్, విఠల్ మాట్లాడుతూ, పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సము న్నత లక్ష్యంతోనే జగనన్న విద్యా దీవెన పథకానికి సీఎం శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ పథకం కింద ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు తమ కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. జిల్లా విద్యార్థి విభాగం నేతలు రవి, భాను, విశాల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రావినూతలకు శ్రద్ధాంజలి

విశాలాంధ్ర, తెనాలి : నటునిగా, దర్శకునిగా, సాహితీవేత్తగా జీవితాంతం కృషి చేసిన మహోన్నతులు రావినూతల శ్రీరామమూర్తి ప్రజల హృదయాలలో చిరస్మ రణీయులని తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు శ్రద్ధాంజలి ఘటించారు. తెనాలి బిసి కాలనీలో రంగస్థల కళాకారుల సంఘం సమావేశ హాలులో శుక్రవారం రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కీ.శే.రావినూతల శ్రీరామమూర్తి సంస్మరణ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. చిన్నతనం నుండి రచన, నాటక కళలపై ఆకర్షితుడై ఆ కళారంగం పున్నతికి కృషి చేశారన్నారు. సినీ రంగంలో డైరెక్టర్ కె.విశ్వనాథ్ వద్ద సహాయకునిగా పనిచేశారని, ఉద్యోగం చేస్తూ నాటక కళాపరిషత్‌లలో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. నవ్యాంధ్ర, తొలి ఉగాది సాహిత్య పురస్కారాన్ని రాష్ట్రంలో నాటక ప్రదర్శనలిస్తూ ఎన్నో పురస్కారాలు పొందారని ఆయన స్ఫూర్తితో నాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. 50 సంవత్సరాలుగా ఉన్న అభ్యుదయ కళాసమితి తెనాలి సంస్థ అధ్యక్షునిగా పది సంవత్సరాలు పనిచేశారన్నారు. సంస్థ ద్వారా ఎందరో నటీనటులను తయారు చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ మహోన్నత కవి గురజాడ అడుగుజాడలో ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం ప్రదర్శించారన్నారు. ఆయన దర్శకత్వంలోనే నాటికలు రాష్ట్రరాష్ట్రేతరంగా ప్రదర్శించారని ఆయన లేని లోటు తీరనిదన్నారు. సభలో సహజకవి ఐనాల మల్లేశ్వర రావు, గోపాలకృష్ణమూర్తి, ఆర్ అండ్ బి రాజు, కన్నెగంటి మధు సురేష్‌బాబు, సీతారామయ్య ప్రభృతులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో శ్రీరామమూర్తి చిత్రపటానికి కళాకారులు సాహితీపరులు అభిమానులు పూలతో శ్రద్ధాంజలి ఘటించారు.

లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ

విశాలాంధ్ర, తెనాలి : రాష్ట్ర పెన్షనర్స్ జీవిత ధృవీకరణ పత్రాలను 2024వ సంవత్సరం జనవరి 1వ తేదీ నుండి ఫిబ్రవరి 29వ తేదీ వరకు లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని తెనాలి పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు యం.రామకృష్ణమూర్తి తెలిపారు. తెనాలిలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను యస్.టి.ఓ. కార్యాలయం, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం లేదా సౌకర్యం అందుబాటులో ఉన్న ఏదైనా నెట్‌వర్క్ కేంద్రాలలో సమర్పించవచ్చని చెప్పారు. పెన్షనర్స్ కార్యాలయంలో అన్ని వేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.